క్లుప్తంగా

విరబూసిన బ్రహ్మ కమలం



బ్రహ్మ కమలం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారు బేతస్థ చర్చి పక్కన ఆదివారం రాత్రి బ్రహ్మ కమలం విరబూసింది. ఈ బ్రహ్మ కమలాన్ని అందరూ ఆసక్తిగా తిలకించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా సిద్దులాపూర్ గ్రామానికి చెందిన అజయ్(21) పటాన్‌చెరులోని ఓ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఈయర్ చదువుతూ అమీన్‌పూర్ పరిధిలోని సాయికృప కాలనీలో అద్దె ఇంటిలో ఉంటున్నాడు. ఈ నెల 12వ తేదీన తాను ప్రేమించిన యువతితో వీడియోకాల్ మాట్లాడి ప్రేమ విఫలమైందని గడ్డి మందు తాగి స్నేహితులకు ఫోన్ చేసి సమాచారమిచ్చాడు. దీంతో అతడి స్నేహితులు అజయ్ కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు అజయ్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సోమాజిగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఆదివారం మృతుడి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధించిన వ్యక్తికి రిమాండ్

పటాన్‌చెరు టౌన్: మహిళను వేధించిన కేసులో వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన భర్త చనిపోయిన ఓ మహిళను సంగారెడ్డి శివాజీనగర్ కాలనీకి చెందిన సుదీర్ వేధింపులకు గురిచేసేవాడు. దీంతో బాధితురాలు గతంలో పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతడిని హెచ్చరించి వదిలిపెట్టారు. అనంతరం మళ్లీ ఆమెను వేధింపులకు గురిచేయడంతో నిందితుడు సుధీర్‌ను పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకుని శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

గోనయ్య సేవలు మరువలేనివి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు కాముని గోనయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోమారంలో ఆయన విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

సంక్రాంతి సందడి

జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వెలిగించి ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. రుచికరమైన వివిధ రకాల పిండి వంటకాలు చేశారు. చిన్నారులు, యువకులు గాలిపటాలను ఎగురవేసి ఆనందంగా గడిపారు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో కైట్ ఫెస్టివల్‌ను పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు.



సంగారెడ్డిలో పతంగులు,మాంజా కొనుగోలు చేస్తున్న ప్రజలు



సదాశివపేటలో గాలిపటాలు ఎగురవేస్తున్న వీరశైవ లింగాయత్ సమాజం నాయకులు



కల్హేర్: బహుమతులు ప్రదానం చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహారెడ్డి



మునిపల్లిలో ఇంటి ముందు వేసిన ముగ్గులు



న్యాల్‌కల్‌లో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న బాలిక



మునిపల్లి: అమ్మకానికి సిద్ధంగా ఉన్న పతంగులు



సంగారెడ్డి టౌన్: గాలిపటాలను ఎగురవేస్తున్న చిన్నారులు



కల్హేర్: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు



రామచంద్రాపురం: బహుమతులను ప్రదానం చేస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్‌గౌడ్

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడండి



మొదటి బహుమతి పొందిన మహిళకు వాషింగ్‌మిషన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ముగ్గులకు హిందూ సంస్కృతి సంప్రదాయాల్లో విశిష్టత ఉందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని ముత్తంగి సాయిప్రియ కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆబేద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ విశిష్టతను ప్రతిబింబించే విధంగా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్నశ్రీనివాస్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, ఉపసర్పంచ్ లింగారెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మేరాజ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, రామకృష్ణ పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు: సంక్రాంతిని పురస్కరించుకుని పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ హోమ్స్‌లో ఏర్పాటు చేసిన గోదాదేవి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కార్పొరేటర్ కుమార్‌యాదవ్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆదిత్య విల్లాస్ సమీపంలో ఆదివారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

నీటి వనరులను సంరక్షించాలి

జహీరాబాద్: వాటర్‌షెడ్ పనులతో నేల కోతను నివారించడంతో పాటు నీటి వనరులను సంరక్షించవచ్చని ఏఈఓ ప్రదీప్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రంజోల్ గ్రామంలో బైఫ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో చేపట్టిన పనులను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ మేనేజర్ అరుణ్‌కుమార్, రైతులు మోహన్, చంద్ర, రాములు, అమీర్, బాష పాల్గొన్నారు.



వాటర్‌షెడ్ పనులను ప్రారంభిస్తున్న ఏఈఓ ప్రదీప్‌కుమార్

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



కంగ్టి: బాన్సువాడలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని బాన్సువాడ, నాగన్‌పల్లి, కంగ్టిలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లింగంపల్లిలో శోభాయాత్ర

మునిపల్లి(అందోల్): ఈ నెల 22న అయోధ్య శ్రీరాముడి మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో భక్తులు శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగేశ్, గ్రామపెద్దలు గోవర్ధన్, శేఖర్, విజేందర్, రాము, సచిన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



మునిపల్లి: లింగంపల్లిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర నీలి కుల సంఘం సంగారెడ్డి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంగారెడ్డిలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు నీలి అంజయ్య, ప్రధాన కార్యదర్శి నీలి సుధీర్‌కుమార్, కోశాధికారి సంగమేశ్వర్, సభ్యులు యాదయ్య, చంద్రయ్య, ప్రవీణ్, నారాయణమూర్తి, వినోద్, రాజ్‌కుమార్, శ్రీనివాస్, యాదగిరి, ప్రకాశం, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): సంక్రాంతి పండుగ సందర్భంగా అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు జీవన్ముక్త మహరాజ్ సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో పరమహంస పరివ్రాజకాచార్య మదనానంద సరస్వతి, పూజ్యపాద గురురాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ఆశ్రమ భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పరామర్శ

నారాయణఖేడ్: పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన బాణాపురం కిష్టన్న(405) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు రాజు, ఖేడ్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు అవుటి శంకర్, నాయకులు లక్ష్మయ్య, కృష్ణ, రవి, అశోక్ తదితరులు కిష్టన్న మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని రామేశ్వరంబండ గ్రామానికి చెందిన గొల్ల సంధ్యకు పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో ఆదివారం ఉదయం 108 వాహనంలో తరలిస్తుండగా బచ్చుగూడెం చౌరస్తా సమీపంలోకి రాగానే నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ ప్రశాంత్, డాక్టర్ శ్రీకాంత్ సూచనల మేరకు ఆమెకు కాన్పు చేశారు. తల్లీబిడ్డను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించినట్లు ఈఎంటీ తెలిపారు. సంధ్య కుటుంబ సభ్యులు ఈఎంటీ ప్రశాంత్, పైలెట్ పండరికి కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ జోడో న్యాయయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయయాత్రకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఖేడ్‌లోని తన నివాసంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలను ఐక్యం చేయాలనే లక్ష్యంతోనే రాహుల్‌గాంధీ రెండో విడత యాత్ర చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, నాయకులు పురంజన్, వెంకట్‌రెడ్డి, ఆకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు. ఖేడ్ మండల పరిధిలోని కిర్యానాయ్ తండా, పోతన్‌పల్లి గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, నగేష్, సర్పంచ్ రాములు, ఉపసర్పంచ్ సంగయ్య, నాయకులు రమేష్‌చౌహాన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బోరుమోటారు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): సేవాలాల్ ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న గ్రామపెద్దలకు, ప్రజాప్రతినిధులకు రుణపడి ఉంటామని సర్పంచ్ శారద అన్నారు. మండల పరిధిలోని టీ మాందాపూర్ తండాలోని సేవాలాల్ ఆలయం వద్ద ఆదివారం బోరుమోటారును ప్రారంభించారు. ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, మడూర్ రైతు సహకార సంఘం ఉపాధ్యక్షుడు యాదగిరి, ఉపసర్పంచ్ యాదగిరి పాల్గొన్నారు.

చిన్నారులకు గాలిపటాలు పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): సంక్రాంతిని పురస్కరించుకొని హత్నూర మండల కేంద్రంలో ఆదివారం జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్లిగారి సాయికుమార్ ఆధ్వర్యంలో చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం కోసం గాలిపటాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో చిన్నారులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

ఖేడ్ 2వ వార్డులో...

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులోని చిన్నారులకు వార్డు కౌన్సిలర్ స్వప్న గాలిపటాలను పంపిణీ చేశారు. పిల్లలు ఆనందంగా పండుగను ఆస్వాదించాలనే ఉద్దేశంతో వార్డు పరిధిలోని అన్ని కాలనీల చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

కార్పొరేటర్ పుష్ప ఆధ్వర్యంలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో ఆదివారం కార్పొరేటర్ పుష్ప ఆధ్వర్యంలో చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.



గాలిపటాలను పంపిణీ చేస్తున్న యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయికుమార్



నారాయణఖేడ్: చిన్నారులకు గాలిపటాలను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ స్వప్న

ముదిరాజ్‌లు అన్నిరంగాల్లో రాణించాలి

ఝరాసంగం(జహీరాబాద్): ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్ అన్నారు. ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం మండల అధ్యక్షుడు సంగన్న ముదిరాజ్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఐక్యమత్యంతో ఉంటూ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేషం, నియోజకవర్గం అధ్యక్షుడు శంకర్, వివిధ మండలాల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, కృష్ణయ్య, కన్వీనర్ కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2001-2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 2001-2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.